# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## రచయిత దర్శకుడైతే..?

## జి. సత్యమూర్తి

### ( విజయచిత్ర 1986, జనవరి సంచికనుంచీ నుంచీ పునర్ముద్రణ)



**తన భావాలకు,** తన అభిలాష మేరకు, అభిరుచి మేరకు సవివరంగా, నిస్సందేహంగా తెరమీదకి రావచ్చు.

తన కథని, డైలాగుల్ని, స్క్రీన్‌ప్లేని, వేరొకరికి చెప్పి ఒప్పించవలసిన స్థితి, కొన్ని కొన్ని పరిస్థితుల్లో మరీ అజ్ఞానపు మేధావుల్ని ఒప్పించే దుర్గతి కూడా తప్పిపోతాము.

"దర్శకుడు" అనే పదానికి వున్న విలువ మరే సాంకేతిక నిపుణుడికీ లేదు. యాభై విజయవంతమైన చిత్రాలు రాసిన రచయిత కంటే, రెండు వందల చిత్రాలు ఎడిట్ చేసిన ఎడిటర్ కంటే, ఎన్నో చిత్రాలు పనిచేసిన ఛాయాగ్రాహకుని కంటే, ఇలా అందరికంటే దర్శకుడికి విలువ, గౌరవం ఎక్కువ. (ఎందుకంటే జయాపజయాలు రెండూ అతని భుజం మీద వేసుకోవలసిన బాధ్యత వుంది కాబట్టి) ఎంత సీనియర్ టెక్నిషియన్ అయినా సరే దర్శకుడి మాట విని తీరవలసిందే. యూనిట్ అంతా ఆయన్నే గౌరవిస్తుంది. అదెలాగంటే మూడు వందల చిత్రాల్లో నటించిన విలన్ పాత్రదారుడి కంటే రెండు చిత్రాలు పొరబాటున సక్సెస్ అయిన హీరోకు ఎక్కువ

విలువ ఇస్తున్నట్టు. పరిశ్రమ ధోరణి ప్రస్తుతం అలా ఉంది. (బహుశా ఎప్పుడూ ఇలాగే వుంటుందేమో?) ఆఖరికి శతదినోత్సవ సభల్లో కూడా ఎంతసేపూ నిర్మాత హీరోని, హీరో నిర్మాతల్ని, హీరోయిన్లు హీరోల్ని ఇలా పరస్పరం చిత్ర విజయానికి ఎలా కారణం అయ్యారో డబ్బా వాయించుకోడంలోనూ, వాయించడంలోనూ మునిగిపోతారు తప్ప మిగతా సాంకేతికుల శ్రమను అస్సలు పట్టించుకోరు. ఈ కార్యక్రమంలో ఎక్కువ దెబ్బలు తినే, చెవులు చిల్లులు పడేలా మోగే దర్శకుడి డబ్బా – దాన్నే అందరూ వాయిస్తారు. ఇలాంటి సందర్భాల్లోనే మిగతా టెక్నీషియన్లకు 'తామూ దర్శకులమైతే పోలే ' అన్న ఊహకు బీజం పడుతుంది. సాగిన వాళ్ళకి, వాళ్ళతో వేగగలిగిన వాళ్ళు దొరికితే దర్శకులుగా మారడం జరుగుతుంది. ఆ చిత్రం సక్సెస్ అయితే వాళ్ళు మహా దర్శకులుగానూ, ఇంకా ఏదో బిరుదులతోనూ చెలామణి కావడం జరుగుతుంది.

రచయిత దర్శకుడు కావాలనుకోవడంలో తప్పు లేదుగానీ, ఇప్పటివరకూ దర్శకులైన రచయితలందరి మీదా ఒక అపవాదు ఉంది. (ఇందులో నిజానిజాలపట్ల నాకెలాంటి బాధ్యత లేదని గ్రహించాలి.) అదేమిటంటే సహజంగా రచన మీద వుండే మోజువల్ల ఎక్కువ సీన్లు రాసేసుకుంటారనీ, జడ్జిమెంట్ లేక ఎక్కువ ముడి ఫిల్మ్ వాడతారనీ, దృశ్యం కంటే శబ్దానికి ప్రాముఖ్యత ఇస్తారనీ, ఇలా రకరకాల అపవాదులున్నాయి. ఇందులో ఎంతో కొంత నిజం వుండి వుండకపోదు. అయితే అది ఆ నిర్మాతకు సంబంధించిన విషయం గనుక మిగతావాళ్ళకి విమర్శించే హక్కులేదు.

అయితే ఎవరు దర్శకుడైనా, నేర్చుకోవలసిన విషయాలు కొన్ని కంపల్సరీగా వున్నాయని ఏకగ్రీవంగా ఒప్పుకోవాలి. అవేమిటంటే ఎడిటింగ్, ఫోటోగ్రఫీ, సంగీతం, సౌండ్ రికార్డింగ్, టెక్నిక్స్ చిత్రీకరణ సౌలభ్యం. పైన చెప్పిన అన్ని శాఖల సాంకేతిక పరిధులు తప్పనిసరిగా తెలిసి తీరాలి. అది తెలియకపోతే దర్శకుడిగా కేవలం సినిమా సక్సెస్ మీద మాత్రమే కొనసాగవలసి వస్తుంది. సినిమా బాగా తియ్యడం. అది విజయవంతం అవడం అనే ఈ రెండు విషయాలకి ఎలాంటి సంబంధం లేదు. బాగా తీసిన సినిమా ఫెయిల్ కావచ్చు. అలాగే చిత్రీకరణ విలువలు లేని సినిమా బాగా విజయవంతం కావచ్చు. సినిమా సాంకేతిక పరంగా బాగుంటే పరిశ్రమ నుంచి అభినందనలు, ఆదరణలభిస్తాయి. విజయవంతమైతే ప్రజల నుంచి ఆదరణ లభిస్తుంది. ప్రజల నుంచి ఆదరణ లభించడమే అన్నిటికంటే ముఖ్యం. ఎందుకంటే ఈ విషయం మీదే నిర్మాత భవిష్యత్, కొనుగోలుదార్ల వ్యాపారం ఆధారపడి ఉంటుంది. అందుకని సినిమాకి కథా, మాటలు ముఖ్యం. ఆ తర్వాతే ఏ సాంకేతిక విలువైనా. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. ఈ రెంటినీ సమపాళ్ళలో సెల్యులాయిడ్ మీద చిత్రీకరించగలిగితే మరీ సంతోషం.

సెట్ బాయ్ నుంచి, పంపిణీదారుడి వరకూ ఎవరైనా ఏ క్షణంలోనైనా 'నేను డైరెక్ట్ చేయబోతున్నాను' అంటే ఏ మాత్రం ఆశ్చర్యపడవలసిన రోజులు కావు ఇవి. అభినందించి ఊరుకోవడమే. ఎందుకంటే ఏ బుర్రలో ఏ ఐడియా ఉందో,

ఏ బాయ్‌లో ఏ గొప్ప దర్శకుడున్నాడో  చెప్పలేం కదా. అందుకని రేపొద్దున నేను కూడా డైరెక్ట్ చెయ్యబోతున్నాను. అని నేనంటే మీరేం పెద్ద ఆశ్చర్యపోకుండా అవకాశముంటే, 'విజయోస్తు' అని ఒక ఆశీర్వాదం పారేయండి అంటాను.

COMMENTS